


ఆఖరి పేషంట్ కూడా వెళ్ళిపోయాక డాక్టర్ అనూరాధ తేలిగ్గా ఊపిరి తీసుకుంటూ రిలీఫ్‌గా వెనక్కి వాలింది

పార్వతి వచ్చి 'ఒంటిగంట అవుతోంది డాక్టర్. పేషంట్లంతా వెళ్ళిపోయారు' అంది, ఇంటికి వెళ్ళిపోవాలనే ఆత్రుతతో

''సరే'' అనూరాధ ఆ రోజు వచ్చిన డబ్బు లెక్కజూసి సొరుగులో సర్దుతుంటే వినోద్ ఫోటో కనిపించింది

బాగా క్రిందికి దిగిన మీసాలు, చురుకైన కళ్ళు, నుదుటిమీద పడుతున్న క్రాఫ్! కొద్దిగా విచ్చుకున్న పెదవులమధ్య కనిపిస్తున్న చక్కని పలువరస!

శబ్దం అవటంతో ఉలిక్కిపడి చూసింది పార్వతి ముఖం తిప్పుకుని ముసి ముసిగా నవ్వుకుంటోంది

అనూరాధ సిగ్గుపడి చప్పున సొరుగు మూసేసింది

అన్నీ సర్దుకుని స్టెత్ అందుకుని లేవబోతుంటే గుమ్మంలో అలికిడయింది.

పార్వతి వచ్చి ''డాక్టర్ ఎవరో వచ్చారు'' అంది.

అనూరాధ మళ్ళీ కుర్చీలో కూర్చుంటూ ''పంపించు'' అంది

రెండు నిముషాల తర్వాత చేతిలో సూట్‌కేస్‌తో అడుగుపెట్టిన స్త్రీని ''రండి! ఇలా కూర్చోండి'' అంది

ఆ స్త్రీ కుర్చీలో కూర్చుంది

''చెప్పండి '' ఏదో అనబోతున్న అనూరాధ తెల్లబోయింది కళ్ళల్లో ఆశ్చర్యం కదలాడుతుండగా ''మై గాడ్! శారదా! నువ్వా'' అంది

శారద ముఖం బాగా పాలిపోయి ఉంది. ఎండలో వచ్చినందువల్లనేమో ముఖంమీద చెమటలు కళ్ళు ఏడ్చినట్టుగా బాగా వాచి ఉన్నాయి అలసిపోయినదానిలా టేబిల్‌మీదికి ఒరిగిపోయింది

అనూరాధ అదిరపడి చప్పునలేచి ''శారదా! ఏమైందే? అలా ఉన్నావేం ఇంత మిట్ట మధ్యాహ్నం ఊడిపడ్డావేం'' అంది తలమీద చెయ్యివేసి

''అనూ! బైట రిక్షా ఉంది రెండు రూపాయలు'' అంది బొంగురుపోయిన గొంతుతో

శారద గొంతులోని మార్పు గమనించి విస్తుబోయినా, హాండ్‌బాగ్ తెరిచి రెండు రూపాయలు తీసుకుని గుమ్మంలో నిలబడ్డ రిక్షావాడికిచ్చి తిరిగి వచ్చింది

నిస్సత్తువగా టేబిల్‌మీద వాలివున్న శారదని, ప్రక్కనే ఉన్న సూట్‌కేస్‌ని చూసి అనూరాధ నొసలు ముడివేస్తూ ''ఏమిటే శారూ విషయం? పెట్టె, బేడాతో దిగావు నీ పతి దేవుడితో గానీ దెబ్బలాడి రాలేదు గదా'' అంది కొంచెం హాస్యంగా.

జవాబుగా వెక్కిళ్ళు వినిపించాయి బాగా ఏడుస్తున్నట్టుగా శారద భుజాలు ఎగిరెగిరి పడుతున్నాయి

అనూరాధ నిశ్చేష్టురాలిలా చూడసాగింది. ''ఏమైంది? శారద ఎందుకేడుస్తోంది!

అనూరాధ తెప్పరిల్లి శారదచేత బలవంతాన మంచినీళ్ళు త్రాగించి రిక్షాలో ఇంటికి తీసుకువచ్చింది

తల్లి ఆరాగా ఏదో అడగబోతున్నా వారించి శారదని కూర్చోబెట్టి, ఫ్యాన్‌వేసి ''ఇప్పుడు చెప్పవే'' అంది.

శారద మెల్ల మెల్లగా, అనూరాధ బుజ్జగిస్తుంటే జరిగిందంతా చెప్పి వెక్కి వెక్కి ఏడవసాగింది

శారద భర్త మోహన్ కాస్త కఠినుడనే తెలుసు గానీ ఇంత దుర్మార్గుడని తెలియదు అనూరాధకి అనుమానం మనిషి శారదని ఫ్రీగా తిరగనిచ్చేవాడు కాదు. ఎవరిళ్ళకీ పంపేవాడు కాదు. ఎవరైనా ఇంటికి వస్తే ఒప్పుకునేవాడూ కాదు!

'మైగాడ్' అనూరాధ నిర్ఘాంతపోయింది.

అందుకే తను శారదని కలుసుకోవడం కూడా మానేసింది ఎప్పుడూ హాస్పిటల్, ఇల్లూ, తీరికుంటే వినోద్ ఉత్తరాలు చదువుకోవటం

''చివరికి ఈ రోజు లేనిపోని నిందలువేసి విడాకులిచ్చేస్తానన్నారు ఇంట్లోనుండి గెంటేశారు తన జాతకంలో తన కసలు పిల్లలే లేరట'' శారద ఏడుస్తోంది

''నేను మోహన్‌ని పిలిపిస్తాను. మాట్లాడతాను'' అని అనూరాధ ఎంత చెప్పినా శారద వినలేదు

''అతనితో నేనిక కాపురం చెయ్యలేను విసిగిపోయాను అనూ! నాకిక చావే శరణ్యం.''

"నీకా అవుసరం ఎప్పుడూ రాదు శారూ! నీకు అండగా నేను నిలబడతాను నీ పాపకోసమైనా నువ్వు బ్రతకాలి"

శారదలో ఆశారేఖ! బ్రతకాలనే తపన!

అనూరాధ ఆ రోజే వినోద్‌కి ఉత్తరం వ్రాసేసింది శారద గురించి

"నీకేం ఫరవాలేదే శారూ! నీ పాపకి రక్షణ నేనున్నాను నీకు బ్రతుకుతెరువు కల్పిస్తాను ఛాలెంజిగా బ్రతుకుదువుగానీ"

అనూరాధ ధైర్యం నూరిపోస్తూనే ఉంది

శారద అనారోగ్యం ఏ మాత్రం తగ్గలేదు బాగా నీరసించిపోయింది మొదటినుండి మెత్తటి మనిషయిన శారద ఈ విషయాన్ని అంత తేలిగ్గా తీసుకోలేకపోయింది

"దిగులు పడకే శారూ వినోద్ అమెరికా నుండి రాగానే నర్సింగ్‌హోమ్ ఓపెన్ చేస్తాము. నీకు జీవితాంతం నేను రక్షణగా ఉంటాను మోహన్‌ని పిలిచి నీకు అప్పగిస్తాము కూడా"

"అనూ" శారద శుష్కహాసం చేసింది

"భార్యా, భర్తల తగవులు ఒకరు తీర్చేసి కావు అనూ నీకు తెలీదు ఆయన రారు నేనెప్పటికీ ఇలా ఉండిపోవాలి జీవచ్ఛవంలా"

అనూరాధ ఖండిస్తున్నట్టుగా అంది — "ఒక్కసారి జరిగిపోయిన వివాహ తంతులో ఏమీ లేదు శారూ! భార్యా, భర్తలుగా నిర్ణయించే వివాహ మంత్రాలు కేవలం పగటి కలలు నీ నిర్మలమైన ప్రేమను తృణీకరించి నిన్ను గెంటేసిన భర్తకోసం 'నీతి' అనే పదానికి అర్థం మర్చిపోయిన ఆ అనుమానం మనిషికోసం, నీ జీవితాన్నంతా బలవంతంగా "బలి" పెట్టుకుంటూ పాడుచేసుకుంటావా?"

శారద అవునన లేదు! కాదనలేదు! మౌనంగా ఉండిపోయింది

తొమ్మిది నెలలు నిండగానే శారదకి వెంటనే పురుడొచ్చింది అనూరాధ శారదని లీలా నర్సింగ్ హోమ్‌కి తీసుకెళ్ళింది

శారద కోరికపై మోహన్‌కి ఫోన్ చేసింది వెంటనే రమ్మని

శారదని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసికెళ్ళే ముందు అంది — "అనూ! ఈ ఆపరేషన్ అయినా నేను బ్రతుకుతాననే నమ్మకం లేదు నా పాపని నువ్వు పెంచుతానన్నావు ఆ మాట మర్చిపోకు. నువ్వు వినోద్‌తో సుఖంగా, కలకాలం నాలాంటి అనాథలకి ఆశ్రయం ఇచ్చి, కాపాడుతూ ఉండాలనే కోరుకుంటున్నాను. నా మాటగా ఒకవేళ మోహన్ వస్తే చెప్పు ఆయన జాతకంలో పిల్లలున్నారని చెప్పు లేనిదల్లా భార్య ఒక్కతే"

అనూరాధ కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి

* * *

మోహన్ ఫోన్ పెట్టేశాడు ఆరు నెలలుగా జాడ తెలియకుండా పోయిన శారద అనూరాధ ఆశ్రయంలో ఉందని తెలిసి నిశ్చేష్టుడైపోయాడు.

శారదకు అనూరాధ అనే స్నేహితురాలు ఉందని ఒకటి రెండుసార్లు విన్నాడు తనింకా ఆ అనూరాధ ఫారెన్‌లో ఉందమకున్నాడు అందుకే పట్టించుకోలేదు.

మోహన్ కళ్ళల్లో కొత్త ఆశలు అడుగులు పెట్టినయి ఈ ఆరు నెలలుగా అతను ఎన్ని చిత్రహింసలు పడాలో అన్నీ పడ్డాడు అతన్ని నెత్తిన పెట్టుకునే వాళ్ళు కూడా, ఇప్పుడు చూడగానే తప్పుకుని వెళ్ళిపోతున్నారు

మొన్నటికి మొన్న టైపిస్ట్ వనజ మాట్లాడబోతే "నాకు మగవాళ్ళతో మాటలు పెంచుకోవడం ఇష్టంలేదు సుమండీ! వాళ్ళ మూలానా మా స్త్రీ జాతి ఎన్ని కష్టాల పాలవుతుందో తలచుకుంటే జన్మలో పెళ్ళి వద్దురా బాబూ అనిపిస్తోంది" అంది

చెప్పు తీసుకొ్కట్టినట్టుగా ఉన్న ఆ సమాధానం విని తన కొలీగ్స్ అంతా నవ్వుతూంటే తను ఎంత దహించుకుపోయాడు అవమానంతో!

చిన్నప్పటి నుండీ ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో తను బాధపడుతూనే ఉన్నాడు, అది వయసుతోపాటు పెరిగిందే తప్ప తరగలేదు

ఒక ఆడ, మగ కలసి మాట్లాడుకుంటేనే తన మనసు పిచ్చి ఆలోచలతో వెర్రిగంతులు వేసేది. ప్రతి విషయాన్ని వక్ర దృష్టితో చూడటం తప్ప, ఏ ఒక్కసారి, ఏ విషయాన్ని వాస్తవంగా ఆలోచించలేకపోయాడు

మోహన్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి!

తన నోటి ధాటికి అమాయకురాలైన శారద ఎంత బాధపడేదో! ఆ బాధ చూసి, పైశాచికమైన ఆనందంతో మురిసిపోయేవాడే తప్ప, మానవత్వం గల మనిషిగా "అయ్యో ఎంత పని చేశాను" అని ఎన్నడూ అనుకున్న పాపాన పోలేదు.

తను కోపంతో మండిపోతూ ఒక్కసారి చావ గొట్టేవాడు మౌనంగా ఏడ్చిందే తప్ప ఎదురు తిరగలేదు!

పొరబాటున గుమ్మంలో నిలబడ్డా, పాలవాడితో రెండు నిముషాలు మాట్లాడినా, కూరలు బేరం చేస్తూ కాస్త ఆలస్యం చేసినా "వాడితో ఏ కబుర్లేమిటి" అని ధడామడా తిట్టేసేవాడు

శారద నేరకపోయి ఓసారి కాబోలు "పాలవాడికి లెక్క చెప్పున్నానండీ. ఈ మధ్య రెండు, మూడు సార్లు పాలు ఎక్కువ పోయించుకున్నాం కదా మీ అన్నగారు వచ్చినప్పుడు వాడేమో మూడు లీటర్లు అంటున్నాడు అందుకని " అంది

భార్య అంతటితో వెళ్ళిపోక ఎదురు సమాధానం చెప్పేసరికి తిక్కరేగి "రంకు నేర్చినమ్మ బొంకు నేర్వదా అని పైగా సమర్థింపు కూడానా!" అంటూ గుండెల్లో తూట్లు పొడిచాడు

శారద గుడ్ల నీళ్ళు కుక్కుకుంటూ మౌనంగా వంట గదిలోకి వెళ్ళిపోయింది

మోహన్ కర్చీఫ్‌తో చెంపల మీదికి జారిన కన్నీటిని గట్టిగా తుడుచుకున్నాడు

దీని కంతటికీ కారణం ఆ ప్రసాద్ తనలో ఈ విష బీజాలు నాటిందికూడా ప్రసాద్‌గాడే కాలేజీలో చదువుకునే రోజుల్నుండీ వాడితో స్నేహం నిజానికి ప్రసాద్‌కి లేని అలవాటు లేదు తల్లి దండ్రులు హెచ్చరిస్తున్నా తను వినేవాడు కాదు

ప్రసాద్ మాటే వేదవాక్కు ప్రసాద్ నంది అంటే నంది, పంది అంటే పంది అనేవాడు తను ప్రసాద్ ఆకర్షణ నుండి తను తప్పుకోలేక పోయేవాడు

ప్రసాద్ వదిన పరమ గయ్యాళి నోటికి హద్దు అనేది లేదు భర్తకి కూడా తూచి తూచి పెట్టేది ఆవిడ, ఇక మరిదికేం పెడుతుంది ఫలితం ప్రసాద్ హాస్టల్ పాలయ్యాడు పైగా తలకు మించిన స్నేహాలు ఎన్నెన్నో అలవాట్లకు దారితీసినాయి

ప్రసాద్ స్నేహాన్ని తను వదులుకోలేకపోయేవాడు కానీ, తల్లిదండ్రుల భయంవల్ల అతని మార్గంలోకి మాత్రం వెళ్ళలేకపోయాడు

"కాసు విసిరితే ఎంతటి ఆడవాళ్ళయినా దిగి రావల్సిందే గురూ" అనే ప్రసాద్ మాటలు తన గుండెల్ని గాఢంగా నాటుకుపోయి 'ఆడది' అంటే ఓ చులకన భావం ఏర్పడ్డానికి కారణమయ్యాయి

ప్రసాద్‌కి పెళ్ళయింది భార్యని బందిఖానాలో ఉంచినట్టు గుమ్మం బైటికి రానిచ్చేవాడు కాదు చివరికి ఆ అమ్మాయి పారిపోయింది ఆ మాట ఎవరితో అనలేదు. ఆరోగ్యం బాగాలేక పుట్టింటికి వెళ్ళిందని ప్రచారం చేశాడు.

"అమ్మో! ఆడవాళ్ళకి స్వేచ్ఛ ఇవ్వకూడదు" అని తను ఆనాడు మనసులో ధృఢ నిశ్చయం చేసుకున్నాడు.

అటువంటి సమయంలో తను శారదని పెళ్ళి చేసుకున్నాడు "ఎంతో కట్నమిచ్చి పిల్లనిస్తామంటుంటే ఈ దిక్కుమాలిన సంబంధంచేసుకుంటానంటావేమిట్రా" అని తల్లీ, తండ్రీ, అన్నయ్య విస్తుపోయారు చివాట్లు పెట్టారు అయినా తను వినలేదు

శారద కట్నం తేలేదు చిన్నప్పుడే తల్లిదండ్రులను పోగొట్టుకుని, మేనమామ పెంపకంలో అత్తయ్య ఆరళ్ళలో పెరిగింది

అందరూ ఆశ్చర్యపోయారుకూడా తను చేసిన పనికి ప్రసాద్ భార్య గొప్పింటి బిడ్డ పుట్టింటికి

## ముందే మేలుకో

చేతులు కట్టుకు కూర్చుంటే
చేతకాని వాడంటారు
లేచి నిలుచుంటే
శక్తి వంతుడంటారు
కుక్క ఎగబడుతుంటే—
అదిలించనైనా అదిలించాలి కదా!
పిల్లి ఇంట్లో కొస్తే—
బెదిరించి నపుడే కదా పారిపోయేది!
అందుకే అనుభవంతో
అంటున్నాను బ్రదర్—
అలా అలా వుండిపోతే
అమాయకు డంటారు
తీరా మేల్కొనే టప్పటికే
తిని పోతారు నిన్ను
నిన్ను నిర్జీవిని చేయకముందే
వెన్ను తట్టి మేలుకో!

— కాణిపాకం లింగన్న

మోహన్ కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి, ఇన్ని అవమానాల మధ్య, ఇన్ని అవహేళనల మధ్య. నలిగిపోయిన అతని మనస్సు శారద సాంగత్యంకోసం తహతహ లాడుతోంది

మోహన్ డాక్టర్ అనూరాధ క్లినిక్ వెతుక్కుంటూ వెళ్ళాడు శారదని అనూరాధ లీలా నర్సింగ్ హోమ్‌కి తీసుకు వెళ్ళిందని చెప్పారు

మళ్ళీ ఆటోలోపడి అక్కడికి పరిగెత్తాడు.

శారదకి ఎలా ఉందో? తను ఒక్కసారి శారదని చూసి క్షమాపణ కోరుకోవాలి తన మూర్ఖత్వం మూలంగా శారద బలైపోయింది.

అతను వణుకుతున్న కాళ్ళతో, పరుగులాంటి నడకతో నర్సింగ్‌హోమ్‌లోకి వెళ్ళాడు.

శారద బాధా పూరితమైన కేకలు వినిపిస్తున్నాయి కానీ అప్పటికే ఆలశ్యమైంది. ఆపరేషన్ థియేటర్ తలుపులు మూసుకున్నాయి

* * *

అనూరాధ నిశ్చలంగా కూర్చుండి పోయింది. ఎదురుగా ఆ రోజు పోస్ట్ ఉంది. పేపర్ వెయిట్ క్రింద రెపరెప లాడుతున్న వినోద్ ఉత్తరం ఉంది ఒంట్లో ఉన్న సర్వశక్తుల్నీ కూడగట్టుకుని ఆ ఉత్తరంలోని సారాంశాన్ని జీర్ణించుకోడానికి ప్రయత్నిస్తోంది

డియర్ అనూ!

నీ ఉత్తరం పూర్తిగా చదివాను ఆదర్శం అన్నావు! దీన జనోద్ధరణ అన్నావు అన్నింటినీ ఓ.కే చేశాను చివరికి నువ్వు భర్తని వదిలేసి వచ్చిన ఆడదానికి కూడా ఆశ్రయం ఇచ్చి కాపాడుతున్నావు

నీ ఈ ఆదర్శం ఒక్క శారదతోనే ఆగిపోతుందా? వాళ్ళ సంతానానికి కూడా అండగా నిలబడాలంటావు రేపు ఖర్మకాలి శారదకి ఏదైనా అయితే ఆ బిడ్డని పెంచడానికి కూడా సిద్ధపడతావు.

నేనూ డాక్టర్నే! నాకూ పరువు, ప్రతిష్ట అన్నీ కావాలి. నా తల్లిదండ్రులకు ఇష్టంలేకపోయినా, మన మధ్య ఏర్పడిన ఆకర్షణని పెళ్ళితో ముడిపడాలని ఉబలాటపడ్డాను

ఇక్కడ మా డాడీ ఫ్రెండ్ కూతురు స్వాతి పరిచయమైంది నేనంటే ఎంతో ఇంట్రస్ట్ చూపిస్తోంది డాడీ నాకు, స్వాతికి పెళ్ళి చేయాలని ఉబలాటపడుతున్నారు. మధ్య నేను నలిగిపోతున్నాను

నేను ఇండియా రాదలుచుకోలేదు నీకు నేను కావాలనుకుంటే ఆ హాస్పిటల్ మూసేసి అమెరికా వచ్చెయ్యి ఆ వయసులో ఆదర్శాలని, పేదవాళ్ళకి ఉచిత సేవచెయ్యాలని ఆరాటపడ్డ మాట మాత్రం వాస్తవమే కానీ ఇప్పుడు ఆలోచిస్తే అదంతా ఒట్టి సిల్లీ అనిపిస్తోంది.

ఆదర్శాలు కూడుపెట్టవు అంతస్తు పెంచదు గౌరవాన్నిప్పుడు అదే నేను తెలుసుకుంది. నువ్వూ తెలుసుకుంటావనే ఆశిస్తాను. ప్లీజ్ రిప్లై సూన్.

వినోద్

కొండంత ఆశ ఎవరో డైనమైట్‌తో పేల్చేస్తున్న అనుభూతి!

వినోద్‌మీద ఆకాశంలో అనంతంగా పెంచుకున్న నమ్మకం ఒక్కసారి ఫెళఫెళా రావాలతో కూలి నెత్తిమీద పడ్డట్టు!

సముద్ర గర్భంలో ఫెటేలున ప్రేలిన అగ్ని పర్వతం!

ఎన్నెన్నో నమ్మకాలతో ఆశయాలతో, చేపట్టిన డాక్టర్ వృత్తి విషసర్పంలా బుసలు కొడుతోంది!

మంచు పొరలు కరిగిపోయిన సూర్యోదయంలా వినోద్ మనసు కనిపిస్తోంది.

స్వాతికి, తనకీ ఛాయిస్ ఇస్తున్నాడు!

ఇది ప్రేమా?! కావచ్చు!

ఆ మాటకొస్తే, మోహన్‌ది కూడా ప్రేమే!

వినోద్‌తో పరిచయం, వినోద్‌తో కబుర్లు, వినోద్‌తో షికార్లు, వినోద్‌తో కలిసి నిర్మించుకున్న రమ్యహర్మ్యాలు, వినోద్‌తో కలలుగన్న ఆశయాలు, ఆదర్శాలు ఈ చిన్న ఉత్తరం ముక్కతో సుడిగాలికి ఎగిరిపోయి, దుమ్మూ ధూళిలో కలిసిపోయి నామరూపాల్లేకుండాపోయినాయి

శారద నిష్క్రమణతో కృంగిపోయిన మనసు ఇప్పుడు పూర్తిగా శూన్యమైపోయింది. తన కెందుకింత ఆరాటం! ప్రపంచంలో మనషులే లేరా! తను ఒప్పుకోవాలేగాని డాక్టర్ రాజా ఈ క్షణాన పెళ్ళి చేసుకుంటాడు. మరి తనకెందుకీ దిగులు? అలజడి.! ఈ నరకానికి భాష్యం చెప్పే కవిగానీ, రచయితగానీ ఎవరున్నారు?

శారద అహర్నిశలు ఎందుకు కృంగిపోయిందో ఇప్పుడు అనుభవానికి వస్తోంది!

"డాక్టర్"

అనూరాధకి వినిపించలేదు పిలుపు

"డాక్టర్"

అనూరాధ తలెత్తి చూసింది

మోహన్! భార్య పోయిన తర్వాత భార్య విలువ తెలుసుకున్న మోహన్!

"నేను వెళ్ళిపోతున్నాను"

"మంచిది" నిర్లిప్తంగా ఉంది

"పాపని తీసుకు వెడతాను"

అనూరాధ చివ్వున తలెత్తింది "పాపనా" అన్నట్టున్నాయా చూపులు

మోహన్ కళ్ళు వాల్చుకుని అన్నాడు "క్షమించండి డాక్టర్! నా కసాయి తనానికి శారద బలైపోయింది నేను మూర్ఖుడిలాగే ప్రవర్తించాను అందుకే శారదని పోగొట్టుకున్నాను కనీసం పాపలోనైనా నా శారదను చూసుకుంటాను పాపని"

అతని కళ్ళల్లో నీళ్ళు ఇంకా ఏదో అనబోతున్నవాడు ఆగిపోయాడు.

అనూరాధలో చలనం వచ్చింది బ్రతిమాలి చేయడంతో చివాలున చూసి "సారీ మిస్టర్ మోహన్! ఇప్పటి వరకూ పాపని మీకివ్వాలనే అనుకున్నాను ఈ క్షణంలో ఆ ఉద్దేశం మార్చుకున్నాను రేపు కాకపోతే ఎల్లుండి అయినా మీరు పెళ్ళి చేసుకుంటారు ఈ పాపని నిర్లక్ష్యం చేస్తారు. శారదకి మాట ఇచ్చాను శారద ఆత్మ శాంతి కోసమైనా సరే ఆ పాపని మీకివ్వను నేను పెంచుకుంటాను మీరు పాప తండ్రి అని మర్చిపోండి క్షమించండి. మీరిక వెళ్ళిపోవచ్చు."

అనూరాధ గుండెలు ఎగిసి పడుతున్నాయి!

మోహన్‌కి తెలుసు అనూరాధ నిర్ణయానికి తిరుగుండదు ఆ క్షణంలో అతనిలో ఏ వైరాగ్యం ప్రవేశించిందో ఏమో! మెల్లగావెనక్కి తిరిగి గుమ్మం దాటి వెళ్ళిపోయాడు.

ప్రక్కగదిలో పాప ఏడుపు, ఆయా సముదాయింపు వినిపిస్తోంది అనూరాధ నిస్సత్తువగా టేబిల్ మీదికి ఒరిగి మోచేతి వంపులో తలదాచుకుంది. అప్పటి వరకూ నిశ్శబ్దంగా ఏడుస్తున్న గుండె మూసుకున్న కనురెప్పల చాటు నుండి బైటకి వచ్చింది ★




